# అదృష్టం ఎప్పుడూ ఆడదానిదే....?

అవధానుల విజయలక్ష్మి

పెళ్ళి పందిరి హడావిడిగా వుంది!

పెళ్ళిపీటల మీద వధువు తలొంచుకు కూర్చొంది. అసలే సోగకళ్ళు కిందికి వాల్చిన రెప్పలతో మరింత విశాలంగా కనపడుతున్నాయి.

ఒంటినిండా నింపిన బంగారు నగలు ఆమె ఒంటి రంగుముందు వెలవెల పోతున్నాయి.

పీటలమీంచి లేచి పెళ్ళికొడుకు చెయ్యి పట్టుకొని హోమం చుట్టూ ప్రదక్షిణ చేసినప్పుడు తలంటుకుని చిక్కులు పడ్డ నల్లని జుత్తు పిరుదులను దాటి నాట్యం చేసింది.

పెళ్ళికొడుకుని విడిగా చూసిన వాళ్ళు 'చామన చాయగా వున్నాడు' అనుకుంటారేమో కాని పెళ్ళికూతురి పక్కన చూసిన వాళ్ళుమాత్రం 'అబ్బ ఏం రంగురా బాబు!' అని అనుకోకుండా వుండలేరు.

మగాళ్ళ నలుపుదనంలో కూడా ఓ అందముంటుంది. అయితే ఆ అందాన్ని కూడా మింగేశాయి కుడికంట్లో పూర్తిగా వేసిన పువ్వూ నడుస్తున్నప్పుడు ఎత్తెత్తి భారంగా వేసే అడుగులూ నడినెత్తిమీద ఎంతగా దువ్వినా దాగని బట్టతలా.


పెళ్ళి పందిట్లో చాలామంది వున్నారు.

అందులో కొందరు ఆరువందలకు మించిన పట్టుచీరల్తో ఆరువేలకి మించిన నగల్తో భారీ శరీరాల్తో వున్నారు. మరికొందరు అరవై రూపాయాలకి మించని చీరల్తో ఆరువందలకి మించని నగల్తో వున్నా అందంగా వున్నారు.

ఆపై వాళ్ళు పెళ్ళికొడుకు తరపు వాళ్ళు. ఈ కింది వాళ్ళు పెళ్ళికూతురి తరపు వాళ్ళు.

అయితే వాళ్ళూ వీళ్ళూ కాక కొందరు మామూలు వాళ్ళు కూడా వున్నారు.

వాళ్ళు ఎవరి తరపువాళ్ళూ కాదు. పెళ్ళి చూడ్డానికొచ్చిన వాళ్ళు. ప్రేక్షకులు!




"మొత్తంమీద అమ్మాయి అదృష్టవంతురాలు" అన్నారు మామూలు వాళ్ళలోంచి ఎవరో.

"అదృష్టం అంటే ఇంతా అంతానా? అబ్బాయికి హైద్రాబాదులో రెండు, విశాఖలో మూడు మేడలున్నాయట!" ఇంకెవరో అన్నారు. ఆ మామూలు వాళ్ళంలోంచీ.

"హైద్రాబాదులో రెండు, విశాఖలో మూడు

ఫాక్టరీలున్నాయట!''

''విజయవాడలో వందెకరాల భూముందట!''

''వీళ్ళకు అబ్బాయొక్కడేనట!''

''అమ్మాయి ఒంటినిండా నగలు చూశారా? అవన్నీ వీళ్లు పెట్టినవేనట!''

''అమ్మాయి బంగారుబొమ్మలా వుందనుకో. ఎంత బంగారుబొమ్మయితే మాత్రం? ఆ బడి పంతులు తెచ్చుకొనే మూడువందల జీతంతో ఈ నాలుగో అమ్మాయికి ఇంతమంచి సంబంధం తేగలడా?''

''చచ్చినా తేలేడు....అబ్బాయికి రెండుమూడు లోపాలుంటేనేం....అతని ఇంటిముందు పెళ్ళికూతుళ్ళ తండ్రులు పెద్ద క్యూలో నిల్చునేవారట.''

''నిల్చోరూ మరి? అయినా అంతమందినీ కాదని వాళ్ళ మేడపక్కనున్న రేకులషెడ్‌లోని ఈ అమ్మాయినే కోరి చేసుకొన్నాట్ట!''

''ఏదో సామెత చెప్పినట్లు....అదృష్టం తలుపు తడితే పట్టిందల్లా బంగారమే అవుతుందట.''

''కిందటి జన్మలో ఎన్ని నోములు నోచుకొందో అందుకే ఆ అదృష్టం.''

పెళ్లి జరుగుతున్నంత సేపూ ఆ 'మామూలు వాళ్ళ' మాటలు అలా సాగుతూనే వున్నాయ్.

*

పెళ్లి పందిరి హడావిడిగా ఉంది.

ఇక్కడ కూడా పట్టు చీరల వాళ్ళూ, నూలు చీరల వాళ్ళూ, మామూలు వాళ్ళూ ఉన్నారు.

అయితే ఇక్కడ పట్టు చీరల వాళ్ళు పెళ్ళికూతురి తరఫువాళ్ళు, నూలు చీరల వాళ్ళు పెళ్ళికొడుకు తరఫువాళ్ళు, మామూలు వాళ్ళు మామూలే! ప్రేక్షకులు!

ఇక్కడి పెళ్ళికూతురు బంగారుబొమ్మలా లేదు. సరిగ్గా చెక్కడం రాని వాడు చెక్కిన చందనపు బొమ్మలా ఉంది.

చందనం రంగులోనే కర్రకి గుడ్డచుట్టి పెట్టినట్లు ఉంది. పెళ్ళికూతురు అలంకరణలో కళ్ళకి ఎంత పొడుగు కాటిక రేకలు తీర్చినా చిన్నగా మూసుకుపోతున్నట్లే ఉన్నాయి.

నుదుట పాపిడి పిందే, చెవులకి ఖరీదైన వజ్రపు దుద్దులూ, ముక్కున రవ్వల ముక్కుపుడాకా ఉన్నా, వీటన్నిటినీ మించి స్పష్టంగా కనపడుతున్నాయి, మొహంమీది స్ఫోటకం మచ్చలు.

ఆ పక్కనే కూర్చున్న పెళ్ళికొడుకు తలెత్తి చూసినప్పుడల్లా కళ్ళు కళకళా మెరుస్తున్నాయ్.

నల్లని ఉంగరాల జుత్తు పచ్చని మొహం మీద అందంగా పడుతోంది. ఇద్దరూ పీటలనుంచి లేచినప్పుడు పెళ్ళికొడుకు పెళ్ళికూతురికంటే మూరెడు పొడుగున్నాడు.

''మొత్తంమీద అమ్మాయి అదృష్టవంతురాలు'' అన్నారు మామూలు వాళ్ళలోంచి ఎవరో.

''అదృష్టం అంటే ఇంతా అంతానా? దిష్టిబొమ్మలాటి పిల్లకి రాజకుమారుడిలాటి మొగుడు దొరికాడు!''

''అబ్బాయి రంగు చూడండి అమ్మాయి రంగు ముందు ఎలా మెరిసిపోతోందో?''

''అబ్బాయి మొహం చూడండి అమ్మాయి మొహం ముందు ఎలా రాజఠీవితో వెలిగిపోతోందో!''

''అమ్మాయి ఉద్యోగం చేస్తూ నెలకి వెయ్యికి పైన తెచ్చుకొంటోందట. పైగా తండ్రికి ఒక్కతే కూతురు లక్షలకొద్దీ ఆస్తి!''

''అందుకే ఎల్డీసీ ఉద్యోగం చేస్తున్న ఆ కుర్రాడు ఒప్పేసుకొని వుంటాడు పాపం.''

''నిజమే నాకూ ఆ కుర్రాణ్ణి చూస్తే జాలేస్తోంది. హాయిగా ఏ బంగారుబొమ్మలాంటి పిల్లనో కట్టుకోక అతనికి కర్మేంటి చెప్పు?''

''డబ్బు పాపిష్టిది ఏం చేస్తాంమరి! అంతేకాదు మామగారు పెద్ద ఉద్యోగం ఇస్తానంటే ఇల్లరికాని కూడా ఒప్పేసుకొన్నాడు.''

''హయ్యోరామా! ఎంత కర్మొచ్చి పడిందిరా నీకు తండ్రీ....ఎంత డబ్బుంటే మాత్రమేం లాభం?''

''మొత్తం మీద అమ్మాయి అదృష్టవంతురాలు రాజకుమారుడిలాంటి మొగుడు...ఒక్క పిసరు చాకిరీలేని పుట్టింటి జీవితం....''

''అవును ఏదో సామెత చెప్పినట్లు అదృష్టం కలిసొస్తే శ్రీరామచంద్రుడి లాంటి వాడు మొగుడౌతాడు.''

''కిందటి జన్మలో ఎన్ని నోములు నోచుకొందో అందుకే ఆ అదృష్టం.''


పెళ్ళి జరుగుతున్నంత సేపూ ఆ మామూలు వాళ్ళ మాటలు అలా సాగిపోతూనే వున్నాయి! □

## సామెత

[రచన: సి. వేదవతి; ప్రతులకు: స్పందన సాహితీ సమాఖ్య, 26-162, బుట్టాయిపేట, మచిలీపట్నం-521001; రచయిత్రి, 45, ఎల్. ఇ. సి. కాలనీ, మెహిదీపట్నం, హైద్రాబాదు 500028; పేజీలు: 270; వెల: రు. 15-00]

నుడులు, నానుడులు మనం నిత్య జీవితంలో ఉపయోగించేవే. వాటిని క్రోడీకరించి ఒక పుస్తక రూపంలో తేవడానికి ఇంతకుమునుపే కొన్ని ప్రయత్నాలు జరిగినా, ఈ 'సామెత' పుస్తకంలో జరిగినంత విపులయంగా ఆ యత్నాలు జరుగలేదని నిస్సంశయంగా చెప్పవచ్చును. అందుకు రచయిత్రి అభినందనీయురాలు.

సామెతల స్వభావంతోపాటుగా 'స్త్రీ, పెళ్లి, అల్లుడు, భర్త, అత్తా-కోడలు, పిల్లలు,




చుట్టాలు...' ఇలా వివిధ ప్రకరణాలుగా విభజించి, ఆ సామెతల పూర్వాపరాలను సమీక్షిస్తూ, వాటి అర్థం విపులీకరిస్తూ సులభశైలిలో హృద్యమంగా రచించిన ఈ పుస్తకానికి డా॥ సంజీవదేవ్ 'వీక్షణ' సమకూర్చారు.

## చిన్నారి మనసులు

[రచన: చావరాల సరళాతిలక్; ప్రచురణ: బుడుగు బుక్స్, ఏలూరు రోడ్, విజయవాడ-520002; పేజీలు: 78; వెల: రు. 10-00]

తెలుగులో బాలసాహిత్యం తక్కువగా వెలువడుతున్నదన్న కొరతను ఈ పుస్తకం కొంత వరకు తీరుస్తుంది. పిల్లలు చదవడానికి సులభంగా పెద్ద పెద్ద అక్షరాలతో చక్కగా ముద్రణ సమకూర్చిన ప్రచురణకర్తలు అభినందనీయులు. అయితే వెల కూడా సామాన్య బాలలకు అందుబాటులో ఉండేటట్లుగా ఉంటే బాగుండేది.